యాదగిరిగుట్టలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల

- సైదాపురంలో స్థలాన్ని పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు

సైదాపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌రాబు

యాదగిరిగుట్ట, నవంబర్ 21 : యాదగిరిగుట్టలో ఆర్మీ రిజర్వ్ హెడ్ క్వార్టర్‌తోపాటు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం మండలంలోని సైదాపురం గ్రామ శివారులో వైటీడీఏ పరిధిలో పోలీస్ శాఖకు సంబంధించిన స్థలాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత భవనాలను నిర్మించి త్వరలో ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై చర్చించారు. అనంతరం భువనగిరి జోన్‌లో కేసులపై సమీక్ష జరిపారు. అంతకుముందు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏసీపీ రమేశ్‌కుమార్, పట్టణ సీఐ రమేశ్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో పాల్గొంటే పెరుగనున్న మేధోశక్తి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత

భువనగిరి అర్బన్, నవంబర్ 21 : విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడంతో మేధోశక్తి పెరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని గ్రేస్ చిల్డ్రన్ హోమ్‌లో గురువారం బాలురకు బాలల హక్కులపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

రాంపూర్ ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దుర్గాప్రసాద్

తుర్కపల్లి, నవంబర్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో గల ఆదర్శ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంతోపాటు కూరగాయలు, ఇతర సరుకులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. వంట వండే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటకు ఉపయోగించే సరుకులు నాణ్యమైనవిగా ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని విద్యార్థుల సిలబస్, ప్రాక్టికల్స్, స్టడీ హవర్స్ తదితర విషయాలపై చర్చించారు. ఆ తర్వాత ఉపాధ్యాయుల సమావేశంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏఎంఓ మంజులి, రవికుమార్, రాము, ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ సభ్యత్వాలు అందిస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 21 : పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందన్నారు. మూడు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రూ.6,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు కళాశాలలను బంద్ చేసే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు మంచాల మధు, నాయకులు శ్రావణ్, కార్తీక్, దినేశ్, తరుణ్, మమత, సురేఖ, మధుప్రియ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సరిత

రాజపేట, నవంబర్ 21 : మండలంలోని రఘునాథపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కీర్తిసరిత తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మానవతా దృక్పథంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసిన సరితను ఎంఈఓ చందా రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెంటపర్తి మాధవరెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులు సోమ సత్తిరెడ్డి, ఎలగందుల వెంకటేశ్, ఉదయ్‌కుమార్, కీర్తి, సరిత పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

చౌటుప్పల్, నవంబర్ 21 : ముదిరాజ్‌లను బీసీ-ఏ కేటగిరిలో చేర్చాలని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ అన్నారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సంఘంలో గురువారం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ముదిరాజ్‌లకు రిజర్వేషన్ల అమలు కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పాశం కృష్ణయ్య, నాయకులు పాశం రఘుపతి, శ్రీనివాస్, లింగస్వామి, యుగేంధర్, జంగయ్య, రాజు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి వైభవంగా సువర్ణపుష్పార్చన

సువర్ణ పుష్పార్చనలో భాగంగా స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, నవంబర్ 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో సువర్ణమూర్తులకు బంగారు పుష్పార్చన అత్యంత వైభవంగా సాగింది. గురువారం ప్రధానాలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్ల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించి భక్తుల గోత్రనామాల పేరిటి సంకల్పం జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపి భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి కల్యాణోత్సవ సేవను, నిత్యకల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవ శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.40,85,825 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

24నుంచి సుంకిశాల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వలిగొండ, నవంబర్ 21 : మండలంలోని సుంకిశాల గ్రామంలో ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి, సాధన దంపతుల ఆర్థిక సహాయంతో నిర్మితమైన వేంకటేశ్వరస్వామి 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ గురువారం మధ్యాహ్నం 12గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుపనున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశామని పేర్కొన్నాస్వామివారి కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా ప్రపంచ మత్స్యసంపద దినోత్సవం

భూదాన్ పోచంపల్లి : జెండా ఆవిష్కరిస్తున్న మత్స్య కార్మికులు

వలిగొండ, వనంబర్ 21 : ప్రపంచ మత్స్యసంపద దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్వర్తి గ్రామంలో మత్స్య కార్మికులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో గుర్రాల రాములు, నిమ్మల సురేశ్, గనబోయిన మల్లేశం, కాశయ్య, శంకరయ్య, చంద్రం, లక్ష్మయ్య, రాములు, పెద్దులు, నవీన్, మధు, శేఖర్, పరశురాములు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని మొరిపిరాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర నారాయణ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం మత్స్య కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. సంఘం నాయకులు బెజ్జరబోయిన బాలయ్య, మారయ్య, వెంకటేశ్, మహేశ్, నర్సింహ, శంకరయ్య, దిలీప్, మనోజ్ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జినుకల బసవయ్య, కార్యదర్శి చింతల యాదగిరి, నాయకులు వనం అశోక్, జినుకల భాష, నర్సింహ, శంకర్, బాలకృష్ణ, రామచంద్రం, బసవరాజు, సహదేవ్, రామదాస్, రమేశ్ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణ్

చౌటుప్పల్, నవంబర్ 21 : బ్యాంకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లక్ష్మణ్ సూచించారు. పట్టణంలోని వివిధ బ్యాంకుల సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలు జరుగకుండా నిఘా కోసం సీసీ టీవీలు, అలారం ఏర్పాటు చేసుకోవాలని, సెక్యూరిటీ గార్డులను నియమించి తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎస్‌బీఐ, ఏపీజీవీబీ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళ్ మైసమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.14,96,475

ఆందోళ్ మైసమ్మ దేవాలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 21 : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో గల ఆందోళ్ మైసమ్మ దేవాలయం హుండీని గురువారం ఆలయం ఆవరణలో లెక్కించారు. 4నెలల 20రోజులకు 14,96,475 రూపాయల ఆదాయం సమకూరినట్లు దేవాలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.మోహన్‌బాబు తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు కె.ఏడుకొండలు, సత్తిరెడ్డి, అర్చకుడు శివప్రసాద్ శర్మ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

మాట్లాడుతున్న శ్రీనివాస్

మోత్కూరు, నవంబర్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బందెల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎన్నికల్లో దళితులకు అనేక వాగ్దానాలు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళితులకు అంబేద్కర్ అభయహస్తం పేరున రూ.12లక్షలు ఇస్తామని ప్రకటించి ఏడాది కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి అమలు చేస్తామన్న మాటకు కట్టుబడి లేరని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాయ మాటలకు దళితులు మోసపోవద్దని సూచించారు. సమావేశంలో నాయకులు చెడిపల్లి అజయ్, కూరెళ్ల ప్రశాంత్, సురేందర్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్

ఇంటింటి సర్వేను పారదర్శకంగా చేపట్టాలి : ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 21 : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటి సర్వేను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలందరూ సర్వేకు సహకరించి పూర్తి వివరాలు తెలుపాలని కోరారు. ఆయన వెంట సర్వే సూపర్‌వైజర్ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలలో గ్రంథాలయం

రాజాపేట, నవంబర్ 21 : మండలంలోని దూదివెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి గురువారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహాచారి, వెంకటేశ్వర్లు, రవీందర్, శ్రీనివాస్, ఎలేందర్‌రెడ్డి, కనకయ్య, మధు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

బీబీనగర్, నవంబర్ 21 : మండలంలోని కొండమడుగు గ్రామంలో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమడుగు గ్రామానికి చెందిన చిన్నగల్ల బాబు (29) బుధవారం ఉదయం 11గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం గ్రామానికి చేరువలోని కేఏపాల్ రోడ్డులో ఉరికి వేలాడుతున్న బాబును అటుగా వెళ్తున్న గొర్ల కాపరి చూసి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ మోటార్ల చోరీ

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 21 : మున్సిపాలిటీలోని ముక్తాపురం పరిధి కప్రాయపల్లికి వెళ్లే రహదారిలో కాల్వ సమీపంలో ఉన్న ఏడుగురి రైతుల విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని దొంగలు బుధవారం రాత్రి చోరీ చేశారు. ముక్తాపురం గ్రామానికి చెందిన ఇడమోని అంజయ్య, ఇడమోని రాములు, మునుకుంట్ల బాలరత్నం, ఏనుగు భానుప్రకాశ్‌రెడ్డి, ముద్దం రామచంద్రం, బండారు యాదిరెడ్డి మోటార్లను కరెంటు వైర్లతో సహా ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన మోటర్లు, వైర్ల విలువ సుమారు 2.5 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

డబ్బులు ఇవ్వలేదని కత్తితో దాడి

యాదగిరిగుట్ట, నవంబర్ 21 : డబ్బులు అడిగితే ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి మరణాయుధంతో దాడి చేసి ఒకరిని తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్ పాత గోశాల వద్ద ఉన్న లక్ష్మీనరసింహ డార్మిటరీలో పనిచేస్తున్న కసావు కుమార్‌ను డబ్బులివ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. అందుకు కుమార్ నిరాకరించడంతో అతనిపై ఇమ్రాన్ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. నిందితుడు ఇమ్రాన్ ఇంట్లో ఉన్న సమయంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

పోలీసుల అదుపులో మద్యం విక్రయదారుడు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 21 : ఐఎంఎఫ్ఎల్ డ్రగ్, మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో మండలంలోని మందళ్లగూడెం గ్రామానికి చెందిన గోరె శ్రీనివాస్‌రెడ్డిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం తెలియడంతో హెడ్ కానిస్టేబుల్ రవిశంకర్, హోంగార్డు కృష్ణ గురువారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ వైన్‌షాపుల్లో కొనుగోలు చేసిన మద్యాన్ని అధిక ధరకు విక్రయిస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని, మరో ఇద్దరు మధ్యవర్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

మహిళా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 21 : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు పొదుపు చేసుకొని, లోన్ తీసుకొని వృద్ధిలోకి రావడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేలా ఆలోచన చేస్తున్నారని తెలిపారు. జిల్లాకు 5 మహిళా శక్తి క్యాంటీన్లు వచ్చాయని చెప్పారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏ కార్యక్రమం మొదలు పెట్టినా మహిళల పేరునే మొదలు పెడుతుందన్నారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ద్వారా శిక్షణ పొందిన మహిళలు మహిళా శక్తి క్యాంటీన్ పెట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మహిళలు బ్యాంకు లోన్లతో చిన్న పరిశ్రమలు పెట్టుకొని ఆర్థికంగా ఎదుగాలని సూచించారు. మహిళల అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, డీపీఎం, ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భువనగిరి కలెక్టరేట్/ భువనగిరి అర్బన్, నవంబర్ 21 : మండలంలోని చీమలకొండూరు, ముస్త్యాలపల్లి, బండసోమారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, పట్టణంలోని ఓ గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ బాధితులైన బీఎన్.తిమ్మాపూర్ గ్రామస్తులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ప్రస్తుతం బాధితులకు రూ.50కోట్లు విడుదలయ్యాయని, వారి ఖాతాల్లో వెంటనే వేయాలని అర్డీఓకు సూచించారు. బాధితుల కాలనీలో రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయాలు కలిపించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సింగారంలో సదర్ సమ్మేళనం

సదర్ సమ్మేళనంలో ప్రభుత్వ విప్ ఐలయ్య

రాజాపేట, నవంబర్ 21 : మండలంలోని సింగారంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నల విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, లడ్డుయాదవ్ పాల్గొని మాట్లాడుతూ సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు గుర్రాల రాములుయాదవ్, నాయకులు గుర్రాల తిరుమలేశ్, కృష్ణ, సోములుయాదవ్, నరేశ్‌యాదవ్, శంకర్ యాదవ్, ఐలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 21 : పోచంపల్లి మాజీ సర్పంచ్ తడక లతావెంకటేశం కుమార్తే హరిప్రియ, ప్రదీప్‌కుమార్ వివాహ వేడుకకు భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, సారసరస్వతి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశం, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

అనిల్‌కు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శ

అనిల్‌ను పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 21 : మున్సిపాలిటీలోని రేవణపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోదాసు అనిల్‌కు ఇటీవల అపెండెక్స్ ఆపరేషన్ జరిగింది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు.

కార్పొరేట్ అనుకూల విధానాలతో నష్టపోతున్న దేశం

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 21 : కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు నష్టపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, అన్ని పంటలకు వ్యవసాయ ఖర్చులకు 50శాతం అదనంగా మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు పన్నులు తగ్గిస్తూ.. రైతులు, కార్మికులు అప్పుల భారంతో నలిగిపోతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. పాలకులు కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రైతులు, కార్మికులు పోరా